# కులీనులు

సీతమ్మ మరణవార్త క్షణాల్లో ఆ వీధంతా పాకిపోయింది. ఎన్నడూలేని గుర్తింపు ఆవిడ చనిపోయిన తర్వాతనే వచ్చినట్లు, ఇరుగుపొరుగు వాళ్లు అదే పనిగా ఆవిడ్ని ప్రస్తావించ సాగేరు.

"పాపం! ఇంతలో ఏం ముంచుకొచ్చిందొదినా! మధ్యాహ్నం పెరట్లో బట్టలు ఆరేస్తుండగా నే చూస్తేనూ!" అన్నదొకామె ఆశ్చర్యంగా.

"వానరాకడ ప్రాణం పోకడ ఎవరు చెప్పగలరమ్మా! ఇంతవరకే దేవుడు రాసిపెట్టాడు గావాల్ను"

"అవును మరి! ఇంతకూ జబ్బేవిటో పాపం!" తిరిగి అడిగిందావిడ. 'పాపం' అన్న మాట ముందో వెనుకో చేర్చనిదే ఆవిడకు గొంతు పెగలదు.

"ఏమోనమ్మా! ఇంకా వివరం తెలీలేదు"

ఇంతలో మరోకావిడ అక్కడకు రానే వచ్చింది. వివరాలను చాలా వరకు పుక్కిట పట్టే వచ్చిందామె.

"ఆవిడకు లోగడనే గుండెజబ్బు వున్నదట. సాయంత్రం నాలుగు గంటలకు గుండె నొప్పొందట. పరంధామయ్యగారు వెంటనే రిక్షా చేసుకు ఆస్పత్రికి తీసుకెళ్ళమా వెళ్ళేడట. తీసుకెళ్ళిన కొద్దిసేపటికే ప్రాణం పోయిందిట"

"అయ్యో పాపం! బంగారంలాంటి మనిషి. ఒక మాట అనీ ఎరగదు, అని పించుకునీ ఎరగదు" కళ్లు తుడుచుకుందావిడ.

"కొడుక్కి కబురన్నా వెళ్ళిందో లేదో?"

"కబురు పెట్టకుండా వుంటారా! రాజమండ్రిలో నమకుంటా వుద్యోగం చేస్తున్న ట్లుంది"

"పాపం! ఇంతకాలం సీతారాముల్లా బ్రతికారు. ముసలాయనకు ఇక వండి వార్చే దిక్కులేకపోయింది"

"లేకేం ఖర్మ! కొడుకు దగ్గరకు పోయి వుంటాడేమో!"

"అంత అదృష్టం కూడానా! కోడలు పడనివ్వకే కదూ ముసలాళ్ళిద్దరూ ఇక్కడ

పడున్నది"

చర్చలు అలా సాగుతూనే వున్నాయి. దీపాలు వెలిగాయి. చీకట్లు ముసురుకున్నాయి. ఆ వీధిన మాత్రం శ్మశాన వైరాగ్యం అలుముకునే వుంది.

ఒంటెద్దు బండొకటి ఆ వీధిలోకి తిరిగింది. మూర్తీభవించిన విషాదంలా బండి ముందు నడిచివచ్చిన పరంధామయ్య బండిని ఇంటికి కాస్త దూరంగా ఆపించి, గేటు నెట్టుకొని లోపలకు అడుగుపెట్టబోతున్నందలో ఆ ఇంటి యజమాని పరమేశ్వరశాస్త్రిగారు బయటకు రానేవచ్చారు.

పదిహేనేళ్ళుగా ఆయనింట్లోనే పరంధామయ్య అద్దెకుంటున్నారు.

"జరిగింది విన్నాను. నమ్మశక్యం గావటం లేదు" అన్నారు శాస్త్రి సానుభూతిగా.

పరంధామయ్య మాట్లాడలేదు. ఆయన కళ్ళల్లో నీటిసుడి తిరిగింది.

"అబ్బాయికి కబురు పెట్టారా?"

"టెలిగ్రాం ఇచ్చే వస్తున్నానండీ! ఉదయానికిగాని రాలేకపోవచ్చు"

"కర్మకాండలన్నీ అబ్బాయి వచ్చాకే జరగాలి గావాల్సు. శవాన్ని హాస్పిటల్‌లోనే వుంచారా?"

పరంధామయ్యకు వెంటనే గొంతు పెగల్లేదు.

అప్పటికే ఇరుగు పొరుగు వాళ్ళు పదిమంది దాకా అక్కడకు చేరుకున్నారు. అందరు ఆడవాళ్లు ఇళ్ళలో నుండి చెవులు రిక్కించి తొంగి చూస్తున్నారు.

"ఆ బండిలో వున్నది. హాస్పిటల్‌లో వుంచటానికి కుదరదన్నారు. మీరే దయచూడాలి"

శాస్త్రిగారు ఉలిక్కిపడ్డారు.

"రేపటివరకు శవం ఇంట్లో వుంచుతామంటారా! పిల్లా జెల్లా నాలుగు కుటుంబాలున్న ఇల్లు. అందులో ఆవిడపోయింది విషగడియల్లో" అన్నారు అసమ్మతిగా.

పరంధామయ్య రాతిబొమ్మలా నిలుచుండి పోయారు. ఆయన భయపడినంతా అయింది. ఇన్నేళ్ళుగా నోట్లో నాలుకలా అందరితో కలసి మెలసి బ్రతికారు. అనుకోకుండా వచ్చిన కష్టాన్ని అర్థం చేసుకోపోతారా అన్న ఆశతో వచ్చారు.

అవసరాలకు సరిపోను వచ్చే జీతం రాళ్ళు జీవితంలో ఒక ఇంటివాడిగా స్థిర పడనివ్వ లేదాయనను. కాలు, చెయ్యి కదులుతున్నప్పుడు కొడుక్కి భారం ఎందుకనీను, ఇంతకాలం ఉద్యోగం చేసిన వూరితో మమకారం తెంచుకోలేకనూ ఇక్కడే వుండిపోయారు. పెన్షన్ డబ్బులతో గౌరవంగా బ్రతుకును నెట్టుకొస్తున్నారు.

"దిక్కు మొక్కులేని వారిలా వీధిలో పడుండాల్సిందేనా!" గాద్గదికంగా అన్నారాయన.

"మీ బాధ మీది. మా నమ్మకాలు మావి. మా అదృష్టం కొద్దీ ఆవిడ ఈ నాలుగు గోడల మధ్యనే గుటుక్కు మనలేదు. లేకుంటే పాడు పెట్టాల్సిన పరిస్థితి వచ్చేది" అన్నారు శాస్త్రి.

చుట్టూ మూగిన వాళ్ళు ఏమాత్రం కల్పగజేసుకోవటానికి సాహసించలేదు. మాట పోయినా, నోటు పోయినా అయితే ఫర్వాలేదు. శవాన్ని పరుల ఇంట్లో దింపించటమంటే ఎంత అవస్థం!

"శాస్త్రిగారూ! సాటి కులస్థుడిననైనా కనికరించండి. ఇంత కాలం మీలో ఒకడిగా బ్రతికాను. వీధిలో శవాన్ని వీధిలోనే దహనం చేయించాల్సి రావటం ఎంత దుర్గతో మీకు తెలియనిది కాదు. పెద్దవాడ్ని, మీ కాళ్ళు పట్టుకుంటాను" అంటూ దుఃఖంతో పాదాల మీదకు వంగబోయారు.

"ముట్టుకోకండి" అంటూ ఒక అంగ వెనక్కు వేశారు శాస్త్రి.

తీవ్ర స్వరంతో, "సాటి కులమైనంత మాత్రాన అనాచారాల్ని సహించమంటారా! కులానికి ఆచారాలు, కట్టుబాట్లు ఉన్నాయండీ ! బ్రతికున్న మనుషులున్నందుకు కిరాయి పుచ్చుకునే వాడ్నే కాని దిక్కులేని శవాలకు నీడనిచ్చి నందుకు కిరాయి పుచ్చుకునే అల్పుడ్ని కాదు. దయచేసి వెళ్ళండిక" అంటూనే గేటు మూసి లోపలకు నడిచారు.

పరంధామయ్య కాళ్ళ క్రింద నేల కుంగిపోతున్నట్లనిపించింది. నిలిచే శక్తిలేక నెమ్మదిగా కూలబడ్డారు. అక్కడున్న వారి ముఖాల్లోకి దీనంగా చూసేరు. ఒక్కొక్కరు నెమ్మదిగా తప్పుకున్నారు. తన దుస్థితికి ఆయనకు దుఃఖం ఆగలేదు.

బండివాడు మరేదాసు ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు. పరిస్థితి అర్థమైంది. శాస్త్రి మాటలకు అతని దేహం కుతకుత లాడిపోతునే వుంది. కాని పెద్ద వాళ్ళ వ్యవహారాలలో తలదూర్చడానికి భయపడ్డాడు. ఆయన దుఃఖం అతడిని కదిలించింది.

"అయ్యగారూ!" అన్నాడు జాలిగా.

పరంధామయ్య తెప్పరిల్లి "బాబూ! నీకు ఆలస్యం అవుతున్నట్లుంది. పరిహారంగా అడిగినంత బాడుగ ఇస్తాను. ఈ పరిస్థితుల్లో నా కాళ్ళు చేతులాడ్డం లేదు" అన్నారు బేలగా.

"బాడుగ గురించి కాదయ్యా! మీరు గొప్ప కులపోల్లు. నేను తక్కువ కులపోడ్ని. చమిస్తానంటే ఒక మాటయ్యా!" బిడియంగా చేతులు కట్టుకున్నాడు.

"ఏమిటి నాయనా!".

"బాబయ్యా! మా గూడెంలో గవర్నమెంటోల్లు కట్టించిన సొంత ఇల్లుంది నాకు. నాకేం పట్టింపులు లేవయ్యా. మీకు ఇష్టమైతే అమ్మగార్ని ఈ రేతిరి అక్కడే వుంచుదాం" అన్నాడు వణుకుతున్న స్వరంతో.

అతని మాటలకు పరంధామయ్య మాన్పడిపోయారు.

ఎవర్నయితే తక్కువ కులస్థుడని సమాజం చిన్న చూపు చూస్తున్నదో, పేదవాడని దూరం చేస్తున్నదో, అతని ఔదార్యం ఆయనను మంత్ర ముగ్ధుడ్ని చేసింది.

మరేదాసు బండిని వెనక్కు మళ్ళించాడు.

నాగరికతతో పూడలు దించుకున్న పట్టణానికి, దిష్టికి కట్టినట్లుగా వెలవెలబోతున్న పల్లె అది. అస్తవ్యస్తంగా వున్న రోడ్లమీద అక్కడక్కడా వెలుగుతున్న విద్యుత్ దీపాలున్నాయి. ఇళ్ళల్లో మాత్రం వెలవెలబోతున్న నూనెదీపాలు మినుకు మినుకు మంటున్నాయి.

మరేదాసు ఓ ఇంటి ముందు బండి నిలిపాడు. కేకలేసి ఇరుగుపొరుగును పోగేశాడు. విషయం అందరికీ చెప్పాడు. క్షణాల్లో తలో దిక్కుకు పరుగులు పెట్టేరంతా.

బండి దగ్గర నిలబడి పరంధామయ్య మౌనంగా అంతా గమనిస్తూనే వున్నారు.

నలుగురు నాలుగు పనలు ఎండుగడ్డి తెచ్చి మరేదాసు ఇంటిముందు భాగంలో వున్న

చిన్న వరండాలాంటి భాగంలో పరిచారు. తల దీపపు నూనె కోసం మరేదాసు భార్య సీసా తీసుకుని పదిళ్ళకు తిరిగింది. తలాకాస్త నూనె పోసి దాన్ని నింపేరు. ప్రమిదలో వత్తివేసి తలదీపం పెట్టారు.

శవం పరుండబెట్టడానికి ఏర్పాట్లు పూర్తి చేయగానే నలుగురూ పరంధామయ్య ముందు చేతులు కట్టి నిలుచున్నారు.

"అయ్యా! ఆమెను క్రిందకు దింపించడయ్యా." అన్నాడు మరేదాసు.

"నలుగురూ పడదాం పట్టండి బాబూ!" అన్నారాయన.

"మేమా! ఆవిడగారిని ముట్టుకోటమా!" అన్నాడు మరేదాసు ఆశ్చర్యంగా.

వాళ్ళ సంశయం పరంధామయ్యకు అర్థమైంది.

"బాబూ! నా కులం వాళ్ళనుకున్న నలుగురూ చేసిన సాయం నువ్వు కళ్ళారా చూసేవు. ఎప్పుడైతే నీ వెంట ఈ పల్లెలో అడుగు పెట్టానో అప్పుడే నేనూ మీలో ఒకడిననుకున్నాను. శవాన్ని పట్టండి" అన్నారు దృఢస్వరంతో.

నలుగురూ ముఖముఖాలు చూసుకున్నారు. అడుగు ముందుకు పడలేదు. పరంధామయ్య తిరిగి హెచ్చరించటంతో నిస్సంకోచంగా బండికేసి నడిచారు.

శవాన్ని పట్టి వరండాలో దించారు. కాసేపు అందరూ ఒకచోట చతికిలబడి చర్చించుకున్నారు. పొద్దుపోవటంతో ఒక్కొక్కరుగా తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

రాత్రంతా పరంధామయ్యతోపాటు మరేదాసు, అతని భార్య కూడా జాగారం వున్నారు. పిల్లలకు మాత్రం ఇంత ముద్దపెట్టి భార్యాభర్తలు నీళ్ళతో కడుపు నింపుకున్నారు.

ఉదయం తొమ్మిది గంటలకు పరంధామయ్యగారి కొడుకు కుటుంబంతో వచ్చాడు. తల్లి మరణం కన్నా శవం దుస్థితే అతని హృదయాన్ని బాగా గాయపరిచింది. ఏడుస్తున్న కొడుకును ఓదార్చారు పరంధామయ్య.

అప్పటికే మరేదాసు సాయంతో పరంధామయ్యగారు శవ దహనానికి ఏర్పాటు చేయించారు.

"నాన్నగారూ! శాస్త్రోక్తంగా అన్నీ జరిపించటం అమ్మ ఆత్మకు శాంతి. ఎవరికీ కబురు పెట్టించలేదా?" అడిగాడు కొడుకు.

పరంధామయ్యగారు అంత బాధలోను నవ్వేరు.

కులం వలన జన్మతోనే తాను అధికుడినన్న భ్రమలు రాత్రే పటాపంచలయ్యాయి. మనిషిని సంకుచితత్వంతో అల్పుడ్ని చేసే సాధనాలే కులం, మతం, వాటి కట్టుబాట్లు, నమ్మకాలు అన్న నిర్ణయాని కొచ్చారు. మనిషి యొక్క ఔన్నత్యానికి మానవత్వమే గీటురాయి కాని కులం, మతం కావనుకున్నారు.

"బాబూ! బ్రతుకు తెరువు కోసం కర్మకాండల తంతు జరిపేవాళ్ళు ఆత్మల్ని సంతృప్తి పరుస్తారంటావా! చచ్చిన మనిషికి ఆత్మంటూ వుంటే, రాత్రి జరిగిన పరాభవానికే క్షోభిస్తుంది కాని ఈ పల్లె మనుషుల ఔన్నత్యానికి కించపడదు నాయనా!" అన్నారాయన నిశ్చింతగా.

తండ్రి నిర్ణయం కొడుక్కి అర్థం అయింది. అభ్యంతరపెట్టాలను కోలేదు.

పరంధామయ్య అనుమతితో శవం శ్మశాన వాటికకు కదిలింది.

తమ గోత్రికులు కానివాళ్ళే కాదు, తమ కులం, మతం కానివాళ్ళే శవాన్ని శ్మశానానికి మోసుకెళ్ళారు. వాళ్ళ సానుభూతి, ఆదరణ, ఆయనను విచలితుడ్ని చేసింది.

కొడుకు చితికి నిప్పంటించాడు. శవదహనం పూర్తయింది. అంతా తిరుగు ముఖం పట్టారు. పల్లె చేరుకున్నారంతా.

"మరేదాసు! మీ సాయం బ్రతికున్నంత కాలం మర్చిపోలేను. నా తృప్తి కోసం తీసుకో" అంటూ మూడు వందరూపాయిల నోట్లు అందించబోయారు పరంధామయ్య.

"అయ్యగారూ! సాయం అని మీరే అన్నారు గదయ్యా! చేసిన సాయానికి డబ్బెవరు తీసుకుంటారు!" అన్నాడు వినమ్రంగా చేతులు జోడించి.

ఈ మనుషుల్నేనా తనింతకాలం తక్కువకులం వాళ్ళనుకున్నది. ఈ మనుషుల్నేనా తనింతకాలం అంటరాని వాళ్ళుగా దూరం వుంచింది.

ఉద్వేగంతో చిన్నగా ఆయన దేహం కంపించింది.

వణుకుతున్న చేతులతో డబ్బు ఎంచి, మరేదాసు చేతుల్ని ప్రేమగా స్పృశించి, "దాసూ! బాదుగ డబ్బులు ఇవ్వటం నా ధర్మం" అంటూ అతని చేతుల్లో డబ్బుంచి, తిరిగి చేతులు జోడించారు పరంధామయ్య.

మరేదాసు అభ్యంతర పెట్టలేక పోయాడు.

కుటుంబంతో కదిలి వెళ్తున్న పరంధామయ్య కుటుంబానికి పల్లె పల్లెంతా భారంగా వీడ్కోలు చెప్పింది.

(అభ్యుదయ మాసపత్రిక, ఆగస్ట్ 1988)